క్లుప్తంగా

నేడు రాళ్లచెరువుపల్లెలో ఎన్నికల ప్రచారం

ఓబులవారిపల్లె : మండలంలో నేడు శుక్రవారం రాళ్లచెరువుపల్లె పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ పార్టీ అధ్యక్షులు ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రచారంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులుతోపాటు పార్టీ నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఉదయం ఆరు గంటలకు ప్రారంభమయ్యే ప్రచారం కార్యక్రమంలో నియోజవర్గంలోని నాయకులు కార్యకర్తలు, డైరెక్టర్‌లు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్‌లు బూత్ కమిటీల సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

21న ప్రవేశ పరీక్ష

చిన్నమండెం : ఆదర్శ పాఠశాలలో 2024 – 25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. మండలవ్యాప్తంగా 231 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించాలి


రఘురాం, ఎస్ఐ

పుల్లంపేట : ప్రజలు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పుల్లంపేట ఎస్ఐ రఘురాం సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుల్లంపేట మండల వ్యాప్తంగా 45 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ఆయా పోలింగ్ బూత్‌లలో వారివారి ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవచ్చన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే రౌడీషీటర్లపై బైండోవర్ కేసులు నమోదు చేసి గ్రామాలలో గస్తీ నిర్వహించామన్నారు. అనంతరం ప్రజలకు ఓటుహక్కు గురించి అవగాహన కల్పించారు.

చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న మన్సూర్, రఫీలు

గాలివీడు : ప్రతి ఒక్కరూ రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని బోరెడ్డిగారిపల్లె ఉప సర్పంచ్ మన్సూర్, మాజీ కో–ఆప్షన్ మెంబర్ మహమ్మద్‌రఫీలు పేర్కొన్నారు. మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో రంజాన్ సందర్భంగా గురువారం పేదలందరికి చీరలు పంపిణీ చేశారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం పుణ్యంగా భావిస్తామని, అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. బోరెడ్డిగారిపల్లె, సుగాలితాండా, గొందిపల్లె, బక్కిరెడ్డిగారిపల్లె, హరిజనవాడలలో ఇంటింటికి తిరిగి సుమారు 500 మందికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అహమ్మద్‌బాషా, లాల్‌బాషా, సలీం బాషా, ముజహిద్, మాలిక్, యాకుబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యపూజకోనకు బస్సు సౌకర్యం కల్పించాలి

కడప కల్చరల్: జిల్లా కేంద్రమైన కడప ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రతి సోమవారం నిత్యపూజ కోనకు బస్సు సౌకర్యం కల్పించాలని తాళ్లపత్ర గ్రంథ పరిశోధకులు నాగదాసరి మునికుమార్ ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. పుష్పగిరి క్షేత్ర రక్షణ కమిటీ ప్రతినిధి ఎస్.భారవితో కలిసి ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మంజుల కిరణ్‌కు ఆమె కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు కడప ఆర్టీసీ బస్టాండులో బయలుదేరి 8 గంటలకు చేరుకునే విధంగా, తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు నిత్యపూజకోనలో బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు కడపకు చేరేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్టీసీ బస్టాండు, పాతబస్టాండు, మాచుపల్లి బస్టాండు, టక్కోలి, మాచుపల్లి, మూలపల్లి, సిద్ధవటం, వంతాటిపల్లి మీదుగా బస్సును ఏర్పాటు చేయాలని కోరారు.

గంగమ్మ సన్నిధిలో హోమం


కళశాలతో మహిళల ఊరేగింపు

కడప కల్చరల్ : హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ క్షేత్రంలో జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం భక్తులు పాండురంగ స్వామి ఆలయం నుంచి పవిత్రజలాల కళశాలతో మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. పవిత్రజలంతో అమ్మవారి మూలమూర్తిని అభిషేకించారు. అనంతరం క్షీరం, ఇతర ద్రవ్యాలతో పంచామృతాభిషేకం చేశారు. ఆవరణలో చండీ హోమం నిర్వహించి పూర్ణాహుతి జరిపారు.

అమ్మవారి లడ్డూ వేలం

మదనపల్లె సిటీ : శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక నీరుగట్టువారిపల్లెలోని ఆలయంలో అమ్మవారి లడ్డూ వేలం వేశారు. అమ్మవారి లడ్డూను రూ.9000 చెల్లించి ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు రామ చంద్ర దక్కించుకున్నారు. అనంతరం చీరలు, జ్యోతి నాణెములు వేలం వేశారు.

భక్తిశ్రద్ధలతో ఈద్ - ఉల్ - ఫిత్ర్ ప్రార్థనలు

- ఈద్గాలకు ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో హాజరైన ముస్లింలు
- దాన ధర్మాలూ, ఐదు సార్లు నమాజ్ చేయాలంటూ తెలిపిన మతపెద్దలు
- రంజాన్ ప్రార్థనలకు హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు


లక్కిరెడ్డిపల్లె: రెడ్డివారిపల్లె ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు


రాయచోటి టౌన్: ప్రార్థనలకు హాజరవుతున్న ఎమ్మెల్యే, ముస్లింలు


రైల్వేకోడూరులో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కొరముట్ల


రాజంపేట టౌన్: రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ఆకేపాటి, పోలా

ఓబులవారిపల్లె : మండల వ్యాప్తంగా గురువారం ఈద్ ఉల్ ఫిత్ర్ రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో హఫీజ్ సాహెబ్ మొయినుద్దిన్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపావాసాలు ఉండటమే కాకుండా పేద ప్రజలు కూడా పండుగ చేసుకునేందుకు దాన ధర్మలు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో ఉంటూ సన్మార్గంలో నడుస్తూ ఐదు పూటల నమాజ్ తప్పకుండా చేయాలన్నారు. కాగా మండలంలోని వైకోట, మంగంపేట, చెన్నరాజుపోడు, నూకనపల్లె, చిన్నఓరంపాడు గ్రామాలలో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రాజంపేటలో..

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. అన్ని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాలకు వెళ్లలేని వారు సమీపంలోని మసీదులలో ప్రార్థనలు చేసుకున్నారు. ఈద్గా, మసీదుల్లో నమాజ్ చేయించిన ఖాజీలు, మౌల్వీలు ఆధ్యాత్మిక ప్రసంగం అనంతరం దువా చేశారు. సర్వ మానవాళి శాంతి కోసం జీవితంలో చేసిన పాపాల విముక్తి కోసం అల్లాహ్‌ను వేడుకున్నారు. నమాజ్, దువా అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కాగా ప్రత్యేక ప్రార్థనల్లో జెడ్పీ చైర్మన్, రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఆకేపాటి, పోలా ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రధాన ఈద్గాలో గురువారం ఉదయం పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రంజాన్ ప్రార్థనల్లో చుట్టు పక్కల గ్రామాల పరిధిలోని ముస్లింలు పాల్గొన్నారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మానవతా విలువలకు ప్రతీక రంజాన్ – ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : మానవతా విలువలకు, మత సామరస్యానికి, సమానత్వానికి రంజాన్ పండుగ ప్రతీక అని, పండుగను ముస్లిం సోదరులు సంతోషంగా జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టణంలోని కొత్త ఈద్గా, పాత ఈద్గాలలో ముస్లిం సోదరులతో కలిసి రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి, మానవతా విలువలకు ప్రతీక అయిన రంజాన్ మాసాన్ని ముస్లిం సోదరుల మధ్య ప్రతి ఏటా జరుపుకోవడం తన అదృష్టమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా తీరని కలగా ఉన్న ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఈద్గా మైదానాన్ని ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు తనకు అండగా ఉండడం పూర్వజన్మ సుకృతమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, తనకు ఆ అల్లాహ్ ఆశీస్సులు, మీ ఆశీర్వాదాలు ఉండాలని ఆయన కోరారు. అనంతరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మత పెద్దలతో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు అన్వర్ బాషా, ముజీబ్, ఆదామ్, అబ్దుల్ రౌఫ్, కరీముల్లా, మస్తాన్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, ఇర్ఫాన్, సలాం, గుంటిమడుగు సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, సీహెచ్ రమేష్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధార్మికచింతన అలవరచుకోవాలి

రాయచోటి టౌన్ : ప్రతి ఒక్కరూ ధార్మిక చింతనను అలవరచుకోవాలని అప్పుడు మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రాయచోటి పట్టణంలోని పాత రాయచోటి మాండవ్య నది ఒడ్డున వెలసిన ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఇస్లాం మత గురువు సర్కాజీ షర్ఫుద్దీన్ తోపాటు పలువురు మత గురువులు ప్రత్యేక ప్రార్థనలను నిర్వహింపజేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం మత గురువులు ప్రార్థనలకు హాజరైన ముస్లిం సోదరులను ఉద్దేశించి ప్రసంగించారు. మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో సుమారు నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేసిన తరువాత నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రార్థనే రంజాన్ పండుగ అన్నారు. రాబోయే రోజుల్లో అందరూ సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మత గురువు సర్కాజీ షర్ఫుద్దీన్ ప్రార్థనలో పాల్గొన్న వారందరికీ పలు సూచనలు చేశారు. ప్రతి రోజూ ఐదు సార్లు నమాజ్ చేయాలన్నారు. సోదరాభావంతో కలసిమెలసి జీవించాలన్నారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన ఉండాలని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హారూన్ బాషాలు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అందరినీ ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్‌ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, రియాజుర్ రహిమాన్, ఎస్‌పీఎస్ రిజ్వాన్, నవరంగ షరీఫ్, ఆవుల విష్ణు వర్ధన్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ముస్లిం సోదరులు తదితరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

లక్కిరెడ్డిపల్లె : మత సామరస్యానికి ప్రతీక అయిన ఈద్ ఉల్ ఫిత్ర్ (రంజాన్) వేడుకలను గురువారం ముస్లిం సోదరులు అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. మండలంలోని లక్కిరెడ్డిపల్లి టౌన్ రెడ్డివారిపల్లె ఈద్గాతోపాటు చింతకుంటవాండ్లపల్లి, పెద్దపల్లి, దిన్నెపాడు, పందిళ్లపల్లి, దప్పేపల్లిలోని మసీదులలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రార్థనలు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లెలోని ఈద్గా మైదానంలో రంజాన్ ప్రార్థనల్లో ముస్లిం సోదరులు వందలాదిగా పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు ప్రభుత్వ ఖాజీ అయిన ముక్తియార్ రంజాన్ విశిష్టత, మహమ్మద్ ప్రవక్త అల్లాహ్ అనుగ్రహంపై ప్రత్యేక సందేశమిచ్చారు. రంజాన్ పర్వదినం దానాలు చేశారు. ఆత్మశుద్ధితో అల్లాహ్‌ను ప్రార్థిస్తే కష్టాలన్నీ తొలగి శుభం చేకూరుతుందన్నారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనలు అనంతరం ముస్లింలు గతించిన తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్ద నివాళులు అర్పించారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : రంజాన్ పండుగ సందర్భంగా ఒంటిమిట్ట ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇస్లాం మత గురువులు ఆఫన్ హైదర్ అలీ, మౌలానా అన్వర్ అలీ మజారి గురువారం ఒంటిమిట్ట, మలకాటిపల్లి మదరసా ఈద్గా వద్ద ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంజాన్ నెలలో ముస్లింలు తప్పనిసరిగా చేయాల్సిన పనులను వివరించారు. రంజాన్ మాసం ప్రారంభం అవగానే ప్రపంచంలోని ప్రతి ముస్లిం భగవంతునిపై ఎంతో భక్తితో, నియమ నిబంధనలు పాటిస్తూ కఠిన ఉపవాస దీక్ష నెలరోజులు నిర్వహిస్తూ అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. ఈ మాసంలో ఇలా చేయడం వల్ల ఆ భగవంతుడు ప్రతి ఒక్కరిపై అల్లాహ్ దయ తలచి సుఖశాంతులు ప్రసాదిస్తాడని ప్రతి ఒక్కరి నమ్మకం. అలాగే ఇదే నెలలో పేదలకు జకాత్, ఫిత్రా ఎంతో భక్తితో అందజేస్తారు. మూడు పూటలా తిండికి, ఒంటినిండా బట్టలకు నోచుకోని పేదవారు ఎంతోమంది ఉన్నారు. అలాంటి అభాగ్యులకు పండుగ సందర్భంలో దానం చేయాలని ఇస్లాం బోధిస్తుందన్నారు. దీనినే ఫిత్రా దానం అని పిలుస్తారని చెప్పారు. నెల వంకను చూసి పవిత్ర రంజాన్ మాసం ఉపవాసాలు ప్రారంభిస్తారు. అదే నెలవంక మళ్లీ నెల రోజుల తరువాత చూసి ఈద్–ఉల్–ఫిత్ర్ రంజాన్ పండుగను ఘనంగా జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, జమియా మసీద్ ముతావలి షేక్ అమానుల్లా, డాక్టర్ జిలానీ బాషా, సత్తార్, డీలర్ మస్తాన్, జాకీర్ హుస్సేన్, చాంద్ బాషా, మహమ్మద్ రఫీ, షేక్ అజ్మతుల్లా, మహబూబ్ బాషా, ముస్తఫా, అన్వర్, చానా, సత్తార్, పెద్దఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : మండలంలో ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. 17 గ్రామాలలో ముస్లిం సోదరులు నెల రోజుల నుంచి ఉపవాస దీక్షల ఆచరించిన అనంతరం గురువారం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

రామాపురంలో..

రామాపురం : మండలంలోని చిట్లూరు గ్రామం పాలన్నగారిపల్లె వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ నాయకులు రసూల్ ఖాన్ గురువారం ఇచ్చిన రంజాన్ విందులో నల్లగుట్టపల్లె సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ భూమారపు రామానుజులు, ఉప సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. రసూల్ ఖాన్‌కు ఈద్ ముబారక్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నక్కా నారాయణ, మాజీ ఎంపీటీసీ హరినాథరెడ్డి, సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గాలివీడులో గుర్రాలమిట్టపై ఈద్గాలో..


చిన్నమండెం ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

పెనగలూరులో..

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని ముస్లిం సోదరులు గురువారం భక్తిశ్రద్ధలతో ఈద్ – ఉల్ – ఫిత్ర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చక్రంపేటలోని జామియా మసీదు వద్ద ముస్లిం మైనార్టీలు ప్రార్థనలు నిర్వహించారు. హజరత్ మహమ్మద్ రహమాన్ రంజాన్ పండుగ విశిష్టత గురించి ఉపన్యాసం చేశారు. అలాగే పెనగలూరు, ఓబిలి, నాయుడువారిపల్లి, నారాయణ నెల్లూరు, కొండూరు, కడియంవారిపల్లి గ్రామాలలో రంజాన్ పండుగను జరుపుకున్నారు. ఈ వేడుకలలో ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అలాగే చక్రంపేట ముస్లిం మైనార్టీ నాయకులు మండలంలోని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

చిన్నమండెం : మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ పర్వదిన వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయాన్నే స్నానాలు ఆచరించి కొత్త బట్టలు ధరించి సమీప ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మతగురువులు చెప్పిన ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనలకు పోలీసులు బందోబస్తు కల్పించారు


ఒంటిమిట్ట ఈద్గా వద్ద సందేశాన్ని వింటున్న ముస్లిం సోదరులు


ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని ఈద్గ వద్ద ప్రార్థనలకు హాజరైన ముస్లింలు


సంబేపల్లె: శెట్టిపల్లె ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నా ముస్లింలు


పెనగలూరు మండలం చక్రంపేటలో రంజాన్ విశిష్టతను వివరిస్తున్న మత గురువు


రామాపురం: శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు

సంక్షేమ సారథికి పట్టం కడుదాం

చిట్వేలి : రాష్ట్రంలో సంక్షేమ సారథి, పేదలపాలిట పెన్నిధి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గ్రామ నాయకులు మాదినేని లోకేష్, కనకరాజుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం చెర్లోపల్లి పంచాయతీలోని అనుంపల్లి, రాజుకుంట పంచాయతీలోని అశోక్ నగర్ ఎస్టీ కాలనీలలో మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రాజంపేట ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని కొరముట్ల శ్రీనివాసులు ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వీ మోహన్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, ఎంపీపీ చంద్ర, జెడ్పీటీసీ రత్నమ్మ, తోట శివసాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, సర్పంచ్‌లు సుబ్రమణ్యం రెడ్డి, ఈశ్వరయ్య, బాలు, వెంకటసుబ్బారెడ్డి, నరసింహులు, హరి, రవి, స్థానిక నాయకులు ప్రసాద్, సుబ్బరాయుడు, నాగరాజు, బాబు, పెంచలయ్య, కిషోర్, తేజ తదితరులు పాల్గొన్నారు.


అనుంపల్లిలో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తదితరులు

● కరుణించవమ్మా.. గంగమ్మా

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన బలిజపల్లె గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. జాతరకు వస్తున్న అమ్మవారి వెంట వేల సంఖ్యలో వచ్చారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామం మొత్తం భక్తులతో నిండిపోయింది. పోతురాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఇతర జిల్లాల నుంచి కూడా అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. మొక్కుబడులు ఉన్నవారు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఏడాదంతా చల్లంగా చూడమ్మా అంటూ గంగమ్మను కోరారు. – రాజంపేట టౌన్


పోతురాజును తీసుకొస్తున్న భక్తులు


జాతరలో పాల్గొన్న ఆకేపాటి, పోలా


గండదీయలతో అగ్రహారం మహిళలు

సామాజిక దార్శనికుడు జ్యోతిరావు పూలే

- బడుగుల అభ్యున్నతికి పూలే విశేష కృషి
- ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

రాయచోటి అర్బన్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మ జ్యోతి రావుపూలే అని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న అన్నారు. గురువారం పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో, అంబేద్కర్ చిత్రపటం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు నిర్వహింపబడ్డాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంకన్న, ఎమ్మార్పీఎస్ రామాంజనేయులు మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది అంటూ పూలే సేవలను కొనియాడారు. సమాజ పునర్నిర్మాణానికి పూలే చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు పవన్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, సాయిప్రసాద్, వాసుదేవనాయక్, ఖాజా, ఎమ్మార్పీఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ పేర్కొన్నారు. గురువారం పూలే జయంతి సందర్భంగా లక్కిరెడ్డిపల్లెలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాకిరణం, సామాజిక న్యాయం కోసం పోరాటం చేసి బడుగుల ఆశాజ్యోతిగా నిలిచిన మహానుభావుడు పూలే అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో బడుగులు ముందుకు సాగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ సెల్వరాజ్, దప్పేపల్లి సర్పంచ్ కేశవయ్య, బీసీ సంఘం నాయకులు రవిఆచారి, అశోక్, బసయ్య, భాస్కర్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..


రాజంపేట రూరల్: పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజంపేట రూరల్ : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను రాజంపేటలో గురువారం బీసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అమ్మవారిశాల వద్దనున్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. నివాళి అర్పించిన వారిలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవికుమార్, నాయకులు జీవీ కృష్ణారావు, వడ్డే రమణ, ఎ.అశోక్‌కుమార్, గోవిందు బాలకృష్ణ, డి.రమేష్‌గౌడ్, పోలి మురళీమోహన్‌రెడ్డి, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, పాపినేని విశ్వనాథరెడ్డి, సనిశెట్టి నవీన్‌కుమార్, పేరకం శంకరశెట్టి, రాంనగర్ శ్రీనివాసులు, దండు గోపి, దాసరి పెంచలయ్య, మన్నూరు రామ, బోయపాళెం నాగరాజు తదితరులు ఉన్నారు.


లక్కిరెడ్డిపల్లెలో నివాళి అర్పిస్తున్న బీసీ నాయకులు

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన చూపిన మార్గాన్ని నేటి యువత ఎంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో దిన్నెపాడు రవిరాజు, బీసీ నాయకులు భాస్కర్, నాగేశ్వరావు, భాస్కర్, శ్రీరాములు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట

రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశం కోసం జ్యోతిరావు చేసిన సేవలను కొనియాడారు.


రాయచోటి అర్బన్: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు


రాయచోటి టౌన్: పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వండాడి వెంకటేశ్వర్లు తదితరులు